# ఆధ్యాత్మికత - జీవిత లక్ష్యసాధన

మన గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ మహారాజ్) "మనందరము ఒకే మూలమునుండి వచ్చినాము. మరల మనము ఆ మూలమునకే తిరిగి చేరాలి" అని చెప్పినారు.

ఆ మూలము భగవంతుడు. భగవంతుడు అత్యంత సూక్ష్మము, పవిత్రము. భగవంతుని సంకల్పముచే ఆవిర్భవించిన సమస్త సృష్టి దివ్యత్వముతో కూడియున్నది. కనుక సృష్టిలోని ప్రతిదియు దివ్యత్వమే. సృష్టిలోని జీవరాశులన్నిటిలోను మానవజన్మయే ఉత్కృష్టమైనది. ఎందువలనంటే భగవంతుడు అమితమైన శక్తిని ఉపయోగించు ఉపకరణమైన మనస్సును మానవునకు ప్రసాదించాడు. మనము మొదట ఈ ప్రపంచములో పుట్టినప్పుడు ఏ మూలమునుండి మనము వచ్చినామో ఆ మూలము శుద్ధమైనది కాబట్టి, మనము కూడా శుద్ధమై వుండినాము. కనుక మన మనస్సు తన ప్రప్రథమ స్థితిలో వున్నపుడు పూర్తిగా శుద్ధంగా వుండేది. కాలం గడిచే కొలది మనమే మనస్సును అతిగా కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చేసి, అస్థిరమైన దానినిగాను, చంచలమైనదిగాను తయారు చేసి దాని అలవాట్లను పాడుచేసినాము. ఈ విధముగా జనన మరణ చక్రభ్రమణము నిరంతరముగా సాగిపోవుచుండుటవలన, మన కార్యకలాపాల ఫలితంగా వివిధ రకాల స్థూలత్వమును మనమే ప్రోగుచేసుకున్నాము. కాలక్రమేణా స్వయముగా మనము ఏర్పరచుకొన్న స్థూలత్వపు పొరల ఫలితంగా మన మూలమును గురించి ఎరుకలేక చంచలమైన మనస్సుతో పూర్తిగా భౌతికత్వంలో మునిగి అసహజమైన రీతిలో జీవితమును గడుపుచూ మరింత స్థౌల్యతను పెంపొందించుకొనుచున్నాము. కాబట్టి మనముందున్న జీవిత సమస్య కేవలం ప్రస్తుత జన్మకు పరిష్కారము కనుగొనుట మాత్రమే కాదని, అది జన్మపరంపరకు పరిష్కారము కనుగొనుటయని గ్రహించాలి. అందువలన ప్రస్తుత స్థితినుండి బయటపడి మనము మన మూలానికి తిరిగి చేరగలిగితేనే మన జీవిత సమస్యకు పరిష్కారము లభించినట్లవుతుంది. మనందరికీ మూలమైన భగవంతునితో ఐక్యమగుటయే శాశ్వత సత్యప్రాప్తి. కనుక శాశ్వత ప్రాప్తి పొందుటయే మన నిజ జీవిత లక్ష్యముగా భావించాలి.

సాధారణముగా మానవుడు తన సృష్టియైన స్వార్థము, అహంకారము, మమకారము, అసూయ, ద్వేషము, దురాశ, అపనమ్మకము మొదలైన చెడు లక్షణాలతో తప్పుడు మార్గములో పడి తన ఆవిర్భావమునకు మూలమైన భగవంతుని మరచి పూర్తిగా భౌతిక వాదములో మునిగి మృగ స్థాయిలోనే జీవనము సాగిస్తున్నాడు. నిజానికి ప్రతి మానవుడు తాను ఈ విశ్వములో ఒక భగవదంశను మాత్రమేనని తలంచక తాను వేరు, ప్రపంచములోని మిగతా ప్రజలందరు వేరువేరుగా నున్నారని తలంచి సంకుచితబుద్ధితో తాను తన కుటుంబ స్వలాభము కొరకు

మాత్రమే ప్రయత్నించుచు సమాజములోని మిగినలిన వారితో భిన్నముగా ప్రవర్తించుచున్నాడు. ఈ దుస్థితి ఆధునిక నాగరికతా ప్రభావముతో మానవ జీవితములోని వివిధ రంగములన్నింటికీ వ్యాపించి ప్రపంచమంతటా ప్రతి దేశములోను ప్రతి స్థాయిలోను అశాంతి ప్రబలి ప్రపంచ ప్రజలు సుఖజీవనానికి దూరమగుచున్నారు. భగవంతుడు మానవుని అత్యుత్తమ జీవిగా సృష్టించడానికి కారణం మానవుడు తన మనస్సుతో పశుప్రవృత్తినుంచి బయటపడి, మానవ ప్రవృత్తి నధిగమించి దైవిక ప్రవృత్తితో కూడిన దివ్యలక్షణాలు పెంపొందించుకొని సర్వమానవ సౌభ్రాతృత్వముతో దివ్య మానవునిగా పరిణామముచెంది దివ్యమానవ ప్రపంచా విర్భావమునకు తోడ్పడతాడని తరువాత భగవంతునిలో లీనమై తన సృష్టికి పరిపూర్ణత చేకూరుస్తాడని మాత్రమేనని మనము గ్రహించాలి. ఈ విధముగా మన నిజజీవిత లక్ష్యమును తెలుసుకొని దానిని సాధించుటకు ప్రపంచములో అన్నింటికంటే దానికే ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి.

పూర్వ జన్మలనుండి ప్రస్థుత జన్మవరకు మనలను బంధించి వుంచిన పొరల ఫలితంగా స్థూలత్వము పెంపొంది సరియైన మార్గములో పయనించలేక పోవుచున్నాము. ఈ విషవలయం నుంచి బయట పడాలంటే మానవుడు తన సృష్టిని అంతమొదించుకొని భౌతికతా వాదముతో కూడిన జీవన విధానమునుండి ఆధ్యాత్మికతతో కూడిన జీవన విధానమువైపు మరలి అంతర్ముఖుడై సరియైన ఆధ్యాత్మిక సాధన చేయాలి. అప్పుడు మనలో వైరాగ్యము, వివేకము పెంపొంది మనలోను, అందరిలోనున్న ఆత్మయే భగవంతుడనియు, భగవంతుడే మానవ జీవనమునకు లక్ష్యమనియు గ్రహించి మనము సంపాదించే సంపదలు మనవి కావనియు, అవన్నియు భగవంతుడే మనకు సమకూర్చినాడని, మనము ఆ సంపదలకు ధర్మకర్తలము మాత్రమేయని తలంచెదము. ఇట్లు మనలో మార్పువచ్చి సోదరీసోదర భావముతో పరస్పరము సహకరించుకొనుచు, ఇతరులకు, సమాజమునకు హితము చేకూర్చే పనులు చేస్తూ జీవనము గడుపుతాము. ఇట్లు వ్యక్తులలో మార్పు, తరువాత సమాజములో మార్పు, ఆ తర్వాత ప్రపంచములో మార్పు వచ్చి దివ్య మానవ ప్రపంచము ఆవిర్భవిస్తుంది. ఈ విధముగా ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధన ద్వారా మనము ఆనందమయ జీవనమును గడుపుచూ నిజజీవిత లక్ష్య మైన శాశ్వత సత్యప్రాప్తిని సులభముగా పొందవచ్చునని మన గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ మహారాజ్) సులభమైన, సరియైన ఆధ్యాత్మిక మార్గము ప్రపంచ మానవాళికి ప్రసాదించినారు. దైవము అత్యంత సూక్ష్మము. అత్యంత సూక్ష్మ మైన దైవ ప్రాప్తి కై మన గురుదేవులు ప్రసాదించిన అత్యంత సూక్ష్మ విధానమైన శ్రీ రామచంద్ర రాజయోగ సాధనా విధానము మాత్రమే సరియైనదని, సరళ మైనదని ప్రపంచ మానవాళి గ్రహించాలి.

శ్రీ రామచంద్ర రాజయోగ సాధనలో ప్రాణాహుతి ప్రధానమైనది. ఈ సాధనా విధానమునే

ప్రాణాహుతి సహిత ధ్యానము అని కూడా అంటారు. ఈ సాధనా విధానములో ప్రాణాహుతి విశిష్టమైనది. ప్రపంచములో ఆధునిక విజ్ఞానం సాంకేతికంగా పురోగమిస్తున్నకొలది, దాని ప్రభావము ఆధునిక నాగరికతలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రతిఫలిస్తున్నది. ఈ పరిణామ క్రమంలో వికృత విదేశీ విష సంస్కృతి, అవాంఛనీయ పోకడలు ఆధునిక జీవన విధానము పేరుతో రంగ ప్రవేశం చేసి ప్రజల మనస్సులను అల్లకల్లోలపరచి విషపూరిత వాతావరణమును కలుగచేయుటవలన అంతటా అశాంతి ఏర్పడుతున్నది. ఇటువంటి ప్రస్తుత వాతావరణానికి లోనైన మనము విచక్షణాశక్తి కోల్పోయి అశాంతికి గురియగుచున్నాము. కాబట్టి శ్రీ రామచంద్ర రాజయోగ సాధనను ఆచరించుటవలన ప్రాణాహుతి ప్రక్రియ మన మనస్సులోని అంతరంగ స్వభావాలను క్రమపరచి మనలో తక్షణ మార్పును ఫలవంతముగా కలుగచేసి శాంతి ప్రశాంతతలు అనుభవములోనికి తెచ్చి మన నిజజీవిత లక్ష్య మైన ఆ మూలమును మనకు మెల్లమెల్లగా జ్ఞప్తికి తెచ్చి మన ఆధ్యాత్మిక యాత్రను స్థిరపడేటట్లు చేస్తుంది. ఈ ఆధ్యాత్మిక సాధనలో అత్యున్నత స్థితిని పొందడానికి స్వయంకృషి లేక అభ్యాసము మాత్రమే సర్వస్వము కాదు. దీనికి గురుదేవుల దివ్యకృప తోడ్పడుట అత్యావశ్యకము. ఈ సాధనా విధానములో దివ్యకృప అభ్యాసీలోనికి ప్రాణాహుతి ప్రక్రియద్వారా చొప్పింపబడుతుంది. ఈ సాధనా విధానములో ప్రాణాహుతి ద్వారా ఎన్నో జన్మలనుండియే గాక ఆధునిక నాగరికతా ప్రభావముతో ఏర్పడిన సంస్కారాలను, మాలిన్యాలను, అవరోధాలను సమూలముగా తొలగించుటవలన ఆధ్యాత్మిక యాత్ర సాధ్య మై, నిజ జీవిత లక్ష్య మైన శాశ్వత సత్యప్రాప్తిని ఒక జీవితకాలమందే సులభముగా పొందవచ్చును. ఈ విధముగా మన జీవిత సమస్యను మిక్కిలి స్వల్పకాలమందు సులభముగాను, సమర్థవంతముగాను పరిష్కరించుకొనవచ్చును. కనుక మనందరము మన ప్రాపంచిక కర్తవ్య బాధ్యతలను తగు రీతిగా నెరవేరుస్తూనే మన గురుదేవులు ప్రసాదించిన ప్రాణాహుతి సహిత ధ్యానమును ఆచరించి, సమతుల్యజీవనమును కొనసాగించి, మన గురుదేవులు చెప్పినట్లు ఏ మూలమునుండి మనందరము వచ్చినామో, మరల ఆ మూలమునకే తిరిగి చేరగలము. కనుక శ్రీ రామచంద్ర రాజయోగ సాధనను ఆచరించుట సమస్త మానవాళికి శుభము.

* * *

"ఈనాడు మానవజాతి 'భౌతికత' అనే అజ్ఞానాంధకారములో తారాడుతున్నది. భయము, దురాశ, అసూయలు మానవుని తమ చేజిక్కించుకొన్నాయి. విలువలగురించిన భావనలు నశించిపోయినవి. మీదపడివున్న ఈ అంధకారమునుండి తొలగించి, నిజముగా మానవుని పునరుద్ధరించగలది ఆధ్యాత్మిక దీపమే. భగవంతుడు మనమండి ఆశించిన స్థాయికి మనము ప్రగతి సాధించే విధముగా మనలో ప్రతియొక్కరి హృదయములోను ఆ అనంతత్వ జ్యోతి

ప్రకాశించుగాక!"

**- పూజ్య బాబూజీ మహారాజ్**